విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV THE VOICE OF TELANGANA

ఎడిటర్ జెరిపోతుల సంపత్

9912758107

సంపుటి: 16 | సంచిక : 103 | ఆదివారం 09. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం



■ కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు

4

## అమిత్‌షాతో రాజీనామా చేయించండి

- మోహన్ భాగవత్‌కు కేసీ వేణుగోపాల్ సవాల్
- జెన్‌జీపై ప్రేమ మాటల్లో కాదు.. చేతల్లో చూపాలి
- విద్యార్థులపై అణచివేతను ఎందుకు ఖండించలేదు?
- ప్రభుత్వాన్ని ఆరెస్సెస్ నియంత్రిస్తోందని ఆరోపణ



4

## ఆందోళన వద్దు.. మీకు నేనున్నా

### ఎన్డీఏ ఎంపీలకు మోదీ భరోసా

- కూటమిలో ప్రతి ఎంపీకి సమాన గౌరవం
- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- నేరుగా ప్రధాని కార్యాలయాన్ని సంప్రదించండి
- పార్లమెంట్‌లో అంతరాయాలతో కొత్త ఎంపీలకు అవకాశం దక్కడం లేదని ఆవేదన



# ఫుడ్ శాఖలో 'షాడో' హవా?

- వ్యాపారులను గడగడలాడిస్తున్నాడని ఆరోపణలు
- లైసెన్సులు, వసూళ్లలోనూ కీలక పాత్ర అంటూ ప్రచారం
- అధికారుల తీరుపై చిరు వ్యాపారుల ఆందోళన

**కొత్తగూడెం ఆగస్టు 8 (తెలంగాణ వాణి)**

జిల్లాలో ఆహార భద్రత శాఖ వ్యవహారాల్లో ఓ 'షాడో' వ్యక్తి పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. లైసెన్సులు పొందడం మొదలుకొని తనిఖీలు, ఇతర వ్యవహారాల వరకు సదరు వ్యక్తి కీలకంగా వ్యవహరిస్తున్నారంటూ చిరు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆహార వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

### కల్తీపై నిఘా ఏదీ?

కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై ప్రజల్లో ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో ఆహార భద్రత శాఖ నిఘా మరింత పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే జిల్లాలో ఆ శాఖ పనితీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కల్తీ నియంత్రణ, ఆహార నాణ్యత తనిఖీలపై అధికారులు దృష్టి సారించాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### 'షాడో' చుట్టే లైసెన్సుల వ్యవహారం?

కొత్తగూడెం జిల్లాకు సంబంధించి ఆహార భద్రత శాఖ వ్యవహారాల్లో ఓ వ్యక్తి అనధికారికంగా కీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సదరు వ్యక్తి స్వయంగా పసుపు, కారం, కుంకుమ తదితర వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ శాఖకు సంబంధించిన లైసెన్సుల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యాపార వర్గాల్లో వినిపిస్తున్నాయి. చిన్న హోటళ్లు, కిరాణా దుకాణాలు,





ఫుడ్ వ్యాపారాలు నిర్వహించే వారు లైసెన్సుల కోసం అధికారులను సంప్రదించాల్సి ఉండగా.. ముందుగా సదరు 'షాడో' వ్యక్తిని కలవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కొందరు వ్యాపారులు వాపోతున్నారు.

### మామూళ్ల వసూళ్ల ఆరోపణలు

ఆహార భద్రత శాఖ లైసెన్సుల జారీ, తనిఖీల పేరుతో మామూళ్ల వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం లైసెన్సులు జారీ చేయాల్సి ఉండగా.. మధ్యవర్తుల ప్రమేయం పెరగడంపై వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల స్పందన ఏదీ?

జిల్లాలో ఆహార భద్రత శాఖకు సంబంధించిన వ్యవహారాల్లో అనధికార వ్యక్తుల జోక్యం ఉంటే దానిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు. అలాగే లైసెన్సుల జారీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై కఠినంగా నిఘా పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'షాడో' వ్యవహారంపై ఆహార భద్రత శాఖ అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# మా ప్రభుత్వం వచ్చాక ఆ పాలసీ రద్దు చేస్తాం..

## డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు జాగ్రత్త

### బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

- 10వేల ఎకరాలను ఎవరికో ధారాదత్తం చేయాలని చూస్తున్నారు
- ఈ పాలసీపై పారిశ్రామిక అసోసియేషనర్లకు లేఖలు రాస్తా
- బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హిల్ట్ పాలసీ రద్దు చేస్తాం
- ఈ పాలసీ కింద ఎవరైనా డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు
- భూ మాఫియాతో చేతులు కలపొద్దని పారిశ్రామికవేత్తలను కోరుతున్నారు.
- దైవకృపకు మానవ ప్రయత్నం కూడా ఉంటేనే ఫలితం వస్తుంది.
- హరీశ్‌రావు గుడికి వెళ్తే.. కాంగ్రెస్ నేతలు చిల్లరగా మాట్లాడుతున్నారు.
- షుద్ర పూజలంటూ కాంగ్రెస్ క్షుద్ర, సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తోంది.
- వ్యవసాయం, రైతుల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి పట్టింపు, అవగాహన లేవు.
- పాలమూరు బిడ్డగా చెప్పుకొనే ఆయన.. ఆ జిల్లాకు సాగునీరు ఇవ్వట్లేదు.
- కేసీఆర్ నాయకత్వంలో భారీ పోరాటం



**హైదరాబాద్ తెలంగాణ వాణి)**

నగరంలోని పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ ఫర్మేషన్(హిల్ట్) పాలసీపై సెప్టెంబర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ కార్యని ర్వాహక అధ్యక్షుడు కేటీఆం అన్నారు. 10వేల ఎకరా లను ఎవరికో ధారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పాలసీపై పారిశ్రామిక అసోసియేషనర్లకు లేఖలు రాస్తామన్న ఆయన.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని ప్రకటించారు. మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన కేటీఆర్.. ఈ పాలసీ కింద ఎవరైనా డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు జాగ్రత్త అని హెచ్చరించారు. భూ మాఫియాతో చేతులు కలపొద్దని పారిశ్రామికవేత్తలను కోరుతున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసినన్ని యాగాలు ఎవరూ చేయలేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు చేస్తున్న వరుణ యాగాలు సహా పలు అంశాలపై స్పందిస్తూ.. "యాగాలు చేయొచ్చు కానీ.. ప్రభుత్వం కూడా తన బాధ్యతలు నిర్వర్తించాలి. దైవకృపకు మానవ ప్రయత్నం కూడా ఉంటేనే ఫలితం వస్తుంది. హరీశ్‌రావు గుడికి వెళ్తే.. కాంగ్రెస్ నేతలు చిల్లరగా మాట్లాడుతున్నారు. క్షుద్ర పూజలంటూ కాంగ్రెస్ క్షుద్ర, సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తోంది. వ్యవసాయం, రైతుల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి పట్టింపు, అవగాహన లేవు. పాలమూరు బిడ్డగా చెప్పుకొనే ఆయన.. ఆ జిల్లాకు సాగునీరు ఇవ్వట్లేదు.

అధికారంలో ఉన్నా.. లేకున్నా రాష్ట్రం బాగు కోరుకుంటాం. ఎక్కడికైనా వెళ్దాం.. 24 గంటల కరెంటు ఎక్కడ వస్తుందో చూపాలి. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీరు తీసుకుంటున్నా.. ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. తెలంగాణ నీటి హక్కుల్ని ఏపీ కొల్లగొడుతుంటే పట్టించు౦కోవట్లేదు.

## వానల కోసం 'వరుణ' యాగం



- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- 10న నాగార్జునసాగర్‌లో మహా క్రతువు
- 108 మంది రుత్వికులు.. 11 హోమకుండాలు
- పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్

2

## సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వరద.. రూ.5 వేల కోట్లు సిద్ధం!

- ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల.. మరో రూ.3 వేల కోట్లకు లైన్ క్లియర్
- భూసేకరణ, ఆర్అండ్ఆర్‌తో పనులు ఆగొద్దు.. కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ స్పష్టమైన ఆదేశాలు
- మిడ్‌మానేరు ఎడమ కాలువకు మళ్లీ కదలిక.. పత్తిపాక డీపీఆర్ ఆగస్టు నెలాఖరులోగా
- 96 శాతం పూర్తయిన రోళ్లవాగుకు అటవీ అనుమతులు వేగవంతం

## సామూహిక లైంగికదాడి





- దృశ్యాలు చిత్రీకరించి బెదిరింపులు
- వీడియోలు బయటపెడతామంటూ బ్లాక్‌మెయిల్
- నలుగురు నిందితుల అరెస్టు.. రిమాండ్
- కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

2

## పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ..

### రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం



హైదరాబాద్: దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలవాలని నిర్ణయించింది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆయన కుటుంబానికి పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేయనుంది. ఈ మేరకు పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించి కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున, ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం మరో రూ.25 లక్షలు.. మొత్తంగా రూ.2.25 కోట్లు ఇవ్వాలని, ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేయాలని నిర్ణయించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, చదువు, కుటుంబ సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉంటుందని కేసీఆర్ అన్నారు.

**నర్సంపేటకు కేసీఆర్**

మరోవైపు, కేసీఆర్ ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటకు వెళ్లనున్నారు. దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామం నల్లబెల్లికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించనున్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇవ్వనున్నారు.





## డీలిమిటేషన్ సాకు వెనక దాక్కోవద్దు..

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- బీజేపీ మహిళా వ్యతిరేక వైఖరి యావత్ దేశానికి తెలుసు
- దశాబ్దాలుగా అధికారంలో ఉన్నప్పటికీ ఆ పార్టీ ఎన్నడూ ఒక మహిళను జాతీయ అధ్యక్షురాలిగా నియమించలేదు
- కానీ కాంగ్రెస్ పార్టీ భారతదేశానికి మొట్టమొదటి మహిళా రాష్ట్రపతిని,
- మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిని ఇచ్చింది అంతేకాకుండా కాంగ్రెస్ అధ్యక్ష పదవితో సహా

ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్టు చేసిన మంత్రి.

## ప్రశ్నించడం కాదు.. పరిష్కారం చూపాలి

- వికసిత్ భారత్ దిశగా సాగే మన దేశ ప్రయాణానికి వారి అవసరం ఎంతో ఉంది
- ఏ తరం వారైనా దేశ బాధ్యతను విస్మరించొద్దు
- ఐఐటీ దిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ప్రధాని
- 'ఐఐటీ దిల్లీ గ్రాడ్యుయేట్ల పట్ల గర్వంగా ఉంది.
- సాంకేతికత దగ్గర్నుంచి అనేక రంగాల్లో విస్తృత మార్పులు చోటుచేసుకుంటున్నాయి.
- అందువల్ల జీవితంలో ఎప్పుడూ కుతూహలం కలిగి ఉండాలి.
- "మార్పు అనేది సవాళ్లు, అవకాశాలతో కూడుకుని ఉంటుంది.
- కొత్త పరిష్కారాలను కనుగొనే ధైర్యమే సవాళ్లను అవకాశాలుగా మార్చగలదు.



దేశ యువతరం సామర్థ్యాలపై తమకు ఎంతో విశ్వాసం ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా సాగే మన దేశ ప్రయాణానికి వారి అవసరం ఎంతో ఉందని తెలిపారు. అయితే, ఏ తరం వారైనా దేశ బాధ్యతను విస్మరించొద్దని సూచించారు. ఐఐటీ దిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ప్రధాని ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మోదీ ప్రసంగించారు. "ఐఐటీ దిల్లీ గ్రాడ్యుయేట్ల పట్ల గర్వంగా ఉంది. ఇప్పుడు చదువు పూర్తిచేసుకుని మీరు (విద్యార్థులు) అడుగుపెట్టే బయటి ప్రపంచం చాలా వేగంగా మారుతోంది. సాంకేతికత దగ్గర్నుంచి అనేక రంగాల్లో విస్తృత మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాబోయే 20-30 ఏళ్లలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. అందువల్ల జీవితంలో ఎప్పుడూ కుతూహలం కలిగి ఉండాలి.



## హైడ్రాలో ఉద్యోగాల భర్తీ.. భారీగా తరలివచ్చిన యువత

- ఎల్బీనగర్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్దకు యువత భారీగా తరలి రావడంతో ఉద్రిక్తత
- హైడ్రాలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఉదయం నుంచే స్టేడియం వద్దకు చేరుకున్న యువత సమయం గడిచేకొద్దీ అభ్యర్థుల సంఖ్య భారీగా పెరగడంతో స్టేడియం పరిసరాల్లో తీవ్ర రద్దీ నెలకొంది.
- ఉద్యోగాల కోసం వచ్చిన వారు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో..
- ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని నిరుద్యోగులు డిమాండ్
- యువత భారీగా తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమం
- ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్టేడియం వద్ద భద్రత

## పాలకుర్తిలో ఝాన్సీ రాజేందర్ రెడ్డి వివాహ వార్షికోత్సవ వేడుకలు



**పాలకుర్తి, ఆగస్టు 8(తెలంగాణ వాణి ప్రతినిధి)**
పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరై కేక్ కట్ చేసి ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవ,మహిళా సాధికారతలో ఝాన్సీ రాజేందర్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఘన సన్మానం



**టేకులపల్లి, ఆగస్టు 8 (తెలంగాణ వాణి):**
సమాజానికి సేవలందించిన వారికి ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు బచ్చల పద్మాచారి అన్నారు. టేకులపల్లి బ్రహ్మంగారి దేవాలయంలో శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన చిలకమర్రి రామకృష్ణ, బొడ్డుపల్లి బ్రహ్మాచారి దంపతులను ఘనంగా సన్మానించారు. పోస్టల్ శాఖలో రామకృష్ణ, ఉపాధ్యాయుడిగా బ్రహ్మాచారి సేవలందించారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పద్మాచారి ఆకాంక్షించారు. విశ్వబ్రాహ్మణులు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిగ్గుట్ల వెంకటాచారి, జిల్లా నాయకులు తాళ్లూరి సత్యనారాయణ, టేకులపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తౌడోజు బిక్షమయ్య, నోముల భాస్కరాచారి, ధర్మపురి వీరబ్రహ్మాచారి, ధర్మపురి శ్రీనివాసాచారి, ఆకారవు స్వప్న, చంద్రగిరి రాధాకృష్ణ, కట్టు కోజ్వల సురేష్, ఉరిమెళ్ల యాదాచారి, గజ్జల రవీందర్, గుంతోజు కృష్ణ, మోత్కూరి రామాచారి, రాంబ్రహ్మాచారి, వెనగంటి రవీందర్, గుమ్మడోజు తిరుపతి, మోత్కూరి సతీష్, తౌడోజు మణికంత, తౌడోజు గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

## 300 మంది విద్యార్థులకు రక్తవర్గ నిర్ధారణ

### వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో అవగాహన శిబిరం






**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 8 (తెలంగాణ వాణి)**
స్థానిక వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, మైక్రోబయాలజీ విభాగాల ఆధ్వర్యంలో శనివారం రక్తవర్గ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వీరబాబు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది విద్యార్థులకు రక్తవర్గ పరీక్షలు నిర్వహించి వివరాలను తెలియజేశారు. డాక్టర్ వీరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. రక్తవర్గం ముందుగానే తెలుసుకోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. విద్యార్థులు రక్తదానంపై అవగాహన పెంచుకుని, అవసరమైన వారికి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్మన్ ఎం వి. చౌదరి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రణవ్ కృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ సీ హెచ్. సతీష్, డీన్ సాయి కృష్ణ, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఏ . మల్లేష్, అకడమిక్ డైరెక్టర్ కిరణ్, ఏ ఓ ప్రవీణ్, మైక్రో బయాలజీ అధ్యాపకులు శ్రీధర్, సతీష్, సుధాకర్, బీ ఏ అధ్యాపకులు బీ . దుర్గ ప్రసాద్ తో పాటు ఎన్ ఎస్ ఎస్, మైక్రో బయాలజీ విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన మాజీ కౌన్సిలర్ బండారి

**కొత్తగూడెం, ఆగస్టు 8 (తెలంగాణ వాణి):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రుక్మాంగదర్ బండారి శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఆర్ఎస్ బీఎల్ఏలు సమర్థవంతంగా పనిచేసిన విషయాన్ని కేటీఆర్‌కు వివరించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించినట్లు బండారి పేర్కొన్నారు.



# సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వరద.. రూ.5 వేల కోట్లు సిద్ధం!

- ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల.. మరో రూ.3 వేల కోట్లకు లైన్ క్లియర్
- భూసేకరణ, ఆర్అండ్ఆర్‌తో పనులు ఆగొద్దు.. కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ స్పష్టమైన ఆదేశాలు
- మిడ్‌మానేరు ఎడమ కాలువకు మళ్లీ కదలిక.. పత్తిపాక డీపీఆర్ ఆగస్టు నెలాఖరులోగా
- 96 శాతం పూర్తయిన రోళ్లవాగుకు అటవీ అనుమతులు వేగవంతం



**హైదరాబాద్, ఆగస్టు 08 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అడ్డుగా నిలుస్తున్న భూసేకరణ,పునరావాసం,అటవీ-- పర్యావరణ అనుమతుల సమస్యలను ఇకపై తక్షణమే పరిష్కరించేం దుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం--పునర్నిర్మాణం కోసం రూ.5 వేల కోట్లను ప్రాధాన్యత ప్రాతిపదికన సమకూర్చేం దుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని నీటిపారుదల,పౌరసరఫరా ల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలి పారు. ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల కాగా మరో రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. నిధుల కొరత కారణంగా పూర్తికి చేరువలో ఉన్న ఒక్క సాగునీటి ప్రాజె క్టు కూడా ఆగిపోకూడదని అధికారులకు స్పష్టం చేశారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులపై శనివారం నిర్వహించిన సమగ్ర సమీక్షలో మంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ--పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

**భూసేకరణలో జాప్యం వద్దు.. నిధులు వెంటనే అడగండి**
ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను సాధారణ అంశాలుగా కాకుండా అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలుగా పరిగణించాలని కలెక్టర్లను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలని, ఆర్థిక అనుమతులు, టోకెన్ల విషయంలో ఎలాంటి జాప్యం చేయవద్దని సూచించారు.
ఇంజినీరింగ్ పనులు కొనసాగుతుండగానే సాధ్యమైన చోట్ల భూసేకరణ, భూ యజమానులకు పరిహారం చెల్లింపు, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను సమాంతరంగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఇప్పటికే వేల కోట్ల ప్రజాధనం వెచ్చించిన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి వాటి ప్రయోజనాలను రైతులకు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.

**మిడ్‌మానేరు ఎడమ కాలువకు మళ్లీ కదలిక**
సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను వెంటనే పునఃప్రారంభించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పనులకు అడ్డుగా ఉన్న భూస ంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సవరించిన అంచనాలు, భూసేకరణ, టెండర్లు, చట్టబద్ధ అనుమతుల ప్రక్రియలను ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. "ప్రక్రియల పేరుతో పనులు మరోసారి నిలిచిపోకూడదు" అన్న రీతిలో నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు.

**పత్తిపాకతో 2.40 లక్షల ఎకరాలకు ఆయకట్టు భరోసా**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు కాకతీయ ప్రధాన కాలువలో డి-83 నుంచి డి-94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.
ధర్మపురి, చొప్పదండి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు ఈ పథకం ప్రయోజనం చేకూరనుంది. పత్తిపాక వద్ద 3 టీఎంసీలు లేదా 5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి రెండు ప్రత్యామ్నాయాలను అధికారులు పరిశీలిస్తున్నారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయి. బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సిద్ధం చేసి సమర్పిస్తామని అధికారులు మంత్రికి తెలిపారు.

**96 శాతం పూర్తయిన రోళ్లవాగు.. ఇక అనుమతుల కోసం వేగం**
జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు ఇప్పటికే 96 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై మంత్రి సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచడం ద్వారా స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా లభించనుంది. మూడు బండ్లు,సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లతో పాటు ప్రధాన నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. అయితే బండ్-2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రత్యామ్నాయ అటవీకరణకు అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించడంతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన మిటిగేషన్ ప్లాన్‌కు ఆమోదం లభించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన అనుమతులను కూడా వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**ప్రతి సమస్యకు 'యాక్షన్ పాయింట్'**
సాగునీటి ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ,ఆర్అండ్ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక జాబితా రూపొందించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.
ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి---
-సమస్య ఏమిటి?
-ఎంత నిధులు అవసరం?
-ప్రస్తుతం ఏ దశలో ఉంది?
-పరిష్కారానికి ఎవరు బాధ్యత వహించాలి?
-ఎప్పటిలోగా సమస్య పరిష్కరిస్తారు? అనే అంశాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.
సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చి, తదుపరి సమీక్ష నాటికి తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**"రైతులకు నీరు అందించడంలో ఆలస్యం వద్దు"**
"భూసేకరణ, ఆర్అండ్ఆర్ లేదా అటవీ అనుమతుల కారణంగా ఏ సాగునీటి ప్రాజెక్టు నిలిచిపోయినా వెంటనే ప్రతిపాదనలు పంపాలి. నిధుల విషయంలో ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇప్పటికే వేల కోట్ల ప్రజాధనం ఖర్చు చేసిన ప్రాజెక్టులను పూర్తి చేసి, నిర్దేశిత ఆయకట్టుకు వీలైనంత త్వరగా నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు, నీటి పారుదల శాఖ జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ హాజరయ్యారు.

## స్వర్గీయ కృష్ణారావు రాసిన పుస్తకావిష్కరణకు ముఖ్య అతిథిగా పాల్గొన్న :ఎంపీ రవిచంద్ర



**హైదరాబాద్, ఆగస్టు 08 (తెలంగాణ వాణి ప్రతినిది)**
బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవి చంద్ర స్వగ్రామం మహబూ బాబాద్ జిల్లా ఇనుగుర్తి వాస్తవ్యులు ఒద్దిరాజు కృష్ణారావు ప్రముఖ రచయి త,వైద్యులు. ఇనుగుర్తికి చెందిన ఒ.వీ.నరసింహా రావు,రంగనాయకమ్మ దంపతుల కుమారుడైన కృష్ణారావు పలు సినిమాల నిర్మాణంలో ముఖ్య భూమి క పోషించారు,రచయిత, వైద్యులు,ఆయన 1995లో పరమ పదించారు. ఆయన రాసిన "మిస్ అండ్ మిస్టర్" (వినోద,శృంగార,హాస్యభరిత) పుస్తకావిష్కరణ కార్య క్రమం శనివారం హైదరా బాద్ నార్సింగి-మంచిరేవుల 10 విల్లాస్ లోని నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి కృష్ణారావుతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఆయన కుటుంబ సభ్యు లతో కలిసి గుర్తు చేసుకు న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్రతో కలిసి డాక్టర్ సీ.ఎల్.నర్సింహా రావు,సుభాష్ చంద్ర, రమేష్,శిరీష్ రెడ్డి,సీతారాం చందర్ రావు,ఉమాశంకర్ రావు,శ్రీనివాసరావు, వేణుగోపాల్ రావు,అనిల్ కుమార్,సతీష్,కళ్యాణ్ చంద్ర తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజును కృష్ణా రావు కుటుంబ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు,అంతకుముందు జరిగిన దీపారా ధన,పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# నేటి పిల్లల్లో నేర ప్రవృత్తిని నివారించాల్సిన బాధ్యత అందరిదీ ?

"మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ" అనే ఆర్యోక్తిని త్రికరణ శుద్ధిగా పాటించిన తరం గొప్ప భావి భారత పౌరులుగా ఎదిగింది. ఉమ్మడి కుటుంబంలో అమ్మమ్మ, నానమ్మల జోలపాటలు, నీతికథలు, పొడుపు కథలతో పసివారికి ఉగ్గుపాలతోనే మానవీయ విలువలు అలవడేవి. పెద్దలను గౌరవించడం, చిన్నలను ఆదరించడం అలవోకగా నేర్చుకునేవారు. ఇరుగుపొరుగు సైతం పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, తప్పు జరిగితే వెంటనే సరిదిద్దేవారు.
కానీ నేడు ఆ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనమైంది. ఆ స్థానంలో వ్యక్తిగత కుటుంబాలు, ఒంటరి జీవనం వచ్చాయి.

### పతనానికి కారణాలేమిటి?

1. ఆర్థిక ఒత్తిడి: పెరుగుతున్న ధరల కారణంగా భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. పేద కుటుంబాల్లో ఇద్దరి కూలీ లేకుంటే పొట్ట గడవడం లేదు. ఫలితంగా పిల్లలు ఇంట్లో ఒంటరిగా మిగిలిపోతున్నారు.
2. సాంకేతిక వ్యసనం: మొబైల్ ఫోన్ స్టేటస్ సింబల్‌గా మారింది. కోటీశ్వరుల నుండి పేదల వరకు పిల్లల చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. తల్లిదండ్రులే మొబైల్‌కు అడిక్ట్ అయి పిల్లలు ఏం చూస్తున్నారో గమనించడం లేదు.
3. అశ్లీల, నేర కంటెంట్: ఓటీటీ, నెట్‌ఫ్లిక్స్, సోషల్ మీడియా ద్వారా హింస, అశ్లీలం, క్రైమ్ సీరియల్స్ పిల్లల మనసుల్లో విషం నింపుతున్నాయి. వాయిస్ కమాండ్‌తోనే నేరాలు నేర్చుకునే పరిస్థితి వచ్చింది.

### దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలు

ఇటీవలి ఘటనలు మనల్ని కలచివేస్తున్నాయి. జగిత్యాలలో ఆన్‌లైన్ గేమ్‌కు అడ్డు చెప్పినందుకు బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నంద్యాలలో ముగ్గురు మైనర్లు 9 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశారు. హర్యానాలో టీచర్‌ను, చెన్నైలో ఉపాధ్యాయురాలిని, హైదరాబాద్ కూకట్‌పల్లిలో చిన్నారి సహస్రను మైనర్లే కిరాతకంగా హత్య చేశారు.
ఒక అధ్యయనం ప్రకారం బాల నేరస్తుల్లో 10% మంది మాత్రమే పేద, అనాథ, మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారు. మిగిలిన 90% మంది సంపన్న, మధ్యతరగతి కుటుంబాల పిల్లలే. గత పదేళ్లలో ఈ ధోరణి విపరీతంగా పెరిగింది.

### పరిష్కారం: సంయుక్త బాధ్యత

### ఇది ఒక్కరి బాధ్యత కాదు. నలుగురి భాగస్వామ్యం అవసరం.

1. కుటుంబం: "కుటుంబమే మొదటి పాఠశాల". తల్లిదండ్రులు పిల్లలకు గాడ్జెట్లు కాదు, సమయం ఇవ్వాలి. వారి ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా ఉంచాలి. ఉమ్మడి కుటుంబ విలువలను పునరుజ్జీవింపజేయాలి.
2. పాఠశాలలు: విద్యా ప్రణాళికలో నైతిక, మానవతా విలువలను తప్పనిసరి పాఠాలుగా చేర్చాలి. ఉపాధ్యాయులు రోల్ మోడల్‌గా ఉండాలి. పాఠశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగంపై కఠిన నిఘా ఉండాలి.
3. ప్రభుత్వం: అశ్లీల, నేర కంటెంట్ ప్రసారం చేసే ఓటీటీ, సోషల్ మీడియా వేదికలను కఠిన చట్టాలతో నియంత్రించాలి. అమెరికాలో లాగా మైనర్లు ఘోర నేరాలు చేస్తే తల్లిదండ్రులను కూడా బాధ్యులను చేసే చట్టం తీసుకురావాలి.
4. సమాజం: సోషల్ మీడియా స్వీయ నియంత్రణ పాటించాలి. ఆదర్శ సమాజ నిర్మాణానికి తోడ్పడాలి.

నేడు పిల్లలను కాపాడుకోకపోతే రేపు వారు జువనైల్ హోమ్‌లలో ఊచలు లెక్కపెట్టే పరిస్థితి వస్తుంది. దీనివల్ల సామాజిక విధ్వంసం తప్పదు.
"ఒక పిల్లాడిని పెంచడానికి ఒక ఊరే కావాలి". కాబట్టి వారిలో నేర ప్రవృత్తి నివారణ బాధ్యత తల్లిదండ్రులది, కుటుంబానిది, పాఠశాలది, ప్రభుత్వానిది, సమాజానిది. అందరం కలిసి బాధ్యత తీసుకుంటేనే భావి భారతం సురక్షితంగా ఉంటుంది.



**డా. నీలం సంపత్**
**సామాజిక కార్యకర్త.**
**సెల్: 9866767471**

## మెయిన్ వర్క్‌షాప్, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను తనిఖీ చేసిన డైరెక్టర్

**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 8 (తెలంగాణ వాణి):**
సింగరేణి కార్పొరేట్ ఏరియాలో ఏర్పాటు చేసిన 1.2 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను డైరెక్టర్ (ఈఅండ్ఎం) ఎం. తిరుమలరావు శనివారం తనిఖీ చేశారు. ఎపిసెంటర్ భవనంలో ఏర్పాటు చేసిన 70 కేడబ్ల్యూపీ సోలార్ ప్లాంట్ పనితీరును ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం కార్పొరేట్ ఏరియాలోని మెయిన్ వర్క్‌షాప్‌ను సందర్శించి సిఎన్‌సి యంత్రాల ద్వారా కన్వేయర్ రోలర్ల తయారీ, అసెంబ్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. కన్వేయర్ రోలర్ల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు అందుబాటులో ఉన్న సిఎన్‌సి యంత్రాలను గరిష్ఠంగా వినియోగించి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి గనులు, సీఎచ్‌పీలు, ఎస్టీపీపీల అవసరాలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో నాణ్యమైన కన్వేయర్ రోలర్లను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీఎంలు శ్రీనివా సులు, రామ్‌మోహన్, అధికారులు కేశవరావు, నరేందర్, ఉమామహేశ్వరరావు, ఏవీ రావు, ఏ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్తక వాణిజ్య కమిటీ వైస్ చైర్మన్‌గా శ్రీధర్

### నియామక పత్రం అందించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దారా రమేష్



**కొత్తగూడెం, ఆగస్టు 8 (తెలంగాణ వాణి):**
తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు అనుబంధంగా ఉన్న వర్తక వాణిజ్య కమిటీ వైస్ చైర్మన్‌గా వందనపు శ్రీధర్ నియమితుల య్యారు. ఈ మేరకు రాష్ట్ర మహాసభ జారీ చేసిన నియామక ఉత్తర్వుల ప్రతిని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ధారా రమేష్ శనివారం శ్రీధర్‌కు అందజేశారు. ఇప్పటికే శ్రీధర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్‌గా, కొత్తగూడెం డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా, విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శ్రీధర్‌కు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.



## కొండనాగులలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



**అచ్చంపేట, ఆగస్టు 08(తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి )**
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లోని బల్మూర్ మండలంలోని కొండనాగుల గ్రామంలో శనివారం బీజేపీ మండల అధ్యక్షులు బాలస్వామి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జరిగిన ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు బాలస్వామి యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రమేష్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని వివిధ మోర్చాల మండల స్థాయి కమిటీల ఏర్పాటు, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమంపై మండల స్థాయి సమీక్ష నిర్వహించి, విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్ చౌహాన్, మాజీ మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బోల్గం సైదులు, సంఖ్యల ఆంజనేయులు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణి సెక్యూరిటీ సమస్యలను పరిష్కరించాలని వినతి



**మందమర్రి ఆగస్టు 08 (తెలంగాణ వాణి)**
సింగరేణి సెక్యూరిటీ గార్డ్ ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం సెక్యూరిటీ గార్డ్ లు సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మందమర్రి ఏరియా సింగరేణి సెక్యూరిటీ సంస్థలో ఉన్న పలు సమస్యలపై ఐ ఎన్ టి యు సి సెక్రెటరీ జనరల్ కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డా జనక్ ప్రసాద్ కి తెలియజేయగా వారి ఆదేశాల మేరకు ఏరియా ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య ఆధ్వర్యంలో సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి కి కేంద్ర కమిటీ జాయింట్ సెక్రెటరీ జగన్నాథ చారి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై సెక్యూరిటీ ఆఫీసర్ సానుకూలంగా స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సెక్యూరిటీ సంస్థలో ఉన్న సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా సెక్రటరీ జంగం శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ కె.ఆర్ సంపత్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ చంద్రగిరి మురళి, ఫిట్ కమిటీ సభ్యులు సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాదవుల సమస్యల పరిష్కారమే నా ధ్యేయం

### నూతన యాదవ కమిటీల ఏర్పాటుకు చర్యలు : బండి సదానందం



**మందమర్రి, ఆగస్టు 8 (తెలంగాణ వాణి):**
యాదవుల సమస్యల పరిష్కారమే తన ప్రధాన ధ్యేయమని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం అన్నారు. రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో యాదవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మందమర్రి పట్టణంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, మున్సిపల్ టౌన్ అధ్యక్షులతో గతంలో ఏర్పాటు చేసిన కమిటీలను పరిశీలిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు త్వరలోనే నూతన యాదవ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని యాదవులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆశీస్సులతో జిల్లాలో యాదవ భవనాల నిర్మాణంతో పాటు యాదవుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని బండి సదానందం పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు గంగాధర్ యాదవ్, అల్లంల పావన్న యాదవ్, అల్లంల నాగన్న యాదవ్, బొంతల మల్లేష్ యాదవ్, మందమర్రి టౌన్ అధ్యక్షుడు సిలివెరీ గోపాల్, యువజన అధ్యక్షుడు కత్తెర్ల సంజీవ్, సందనవేణి సంజీవ్ యాదవ్, రేణి సత్తన్న, అమరగాని ఐలయ్య, పిండి ఐలయ్య, కోట రాజన్న, మద్దూరి రాములు, కూకట్ల పోషం, నాగనవేణి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ శాఖలో ఆషాఢ బోనాల వేడుకలు

### బోనాల వేడుకల్లో ముఖ్య అతిథిగా గడియారం శ్రీహరి

**మంచిర్యాల, ఆగస్టు 08 (తెలంగాణ వాణి):**
ఇరిగేషన్ శాఖలో టీఎన్జీవో మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఆషాఢ మాస బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ముఖ్య అతిథిగా, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు విశిష్ట అతిథిగా హాజరై



ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆధ్యా త్మిక విశ్వాసానికి బోనాల పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, రాష్ట్రానికి సుభిక్షం, అభివృద్ధి కలగాలని ప్రతి ఒక్కరూ ప్రార్థిస్తారని తెలిపారు. ఉద్యోగులు తమ విధులతో పాటు తెలంగాణ సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ముఖ్య అతిథి గడియారం శ్రీహరిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా సంయుక్త కార్యదర్శి రోశయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి మోసిన్, సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, అంజయ్య, జ్యోతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి గిరిజనుల ఆరోగ్యానికి భూక్య జంపన్న భరోసా

- **లక్ష్మీపురంలో ఉచిత వైద్య శిబిరం.**
- **వందలాది మందికి పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ**

**ములుగు, గోవిందరావుపేట, ఆగస్టు8 (తెలంగాణ వాణి)**
గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న చేపడుతున్న సేవా కార్యక్రమాలకు మరోసారి విశేష స్పందన లభించింది. గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం గ్రామంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. లక్ష్మీపురంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో డాక్టర్ బోట్ల ప్రవీణ్ నేతృత్వంలో డాక్టర్ కావ్య,ఎండి సలీం, వైద్యులు రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన



వైద్య సూచనలు అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాకాలంలో గిరిజనులు ఎక్కువగా వ్యాధుల బారిన పడుతున్న నేపథ్యంలో వారి ఆరోగ్య రక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి అందేలా కృషి చేయడం నా బాధ్యత. ప్రతి గ్రామపంచాయతీలో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామీణ, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాను" అని స్పష్టం చేశారు. శిబిరానికి హాజరైన గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్న భూక్య జంపన్నను అభినందించారు. ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ ద్వారా ఎంతో ప్రయోజనం కలిగిందని, ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. గిరిజన ప్రాంత ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా భూక్య జంపన్న చేపడుతున్న సేవా కార్యక్రమాలు స్థానిక ప్రజల్లో మంచి ఆదరణ పొందుతున్నాయి.

# అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ క్రీడాకారుల సత్తా

- **నాలుగు పతకాలతో మెరిసిన టీఎంఏఏఐ విద్యార్థులు**
- **అభినందించిన పోలీస్ కమిషనర్**

**నిజామాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
థాయిలాండ్‌లోని పట్టాయాలో నిర్వహించిన 9వ హీరోస్ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి నాలుగు పతకాలు సాధించారు. బోధన్ రోడ్ ఎన్‌ఆర్ఐ కాలనీలోని తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా (టీఎంఏఏఐ)కి చెందిన ముగ్గురు క్రీడాకారులు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. పట్టాయాలోని ఈస్టర్న్ నేషనల్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీల్లో 33 దేశాలకు చెందిన 4,403 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. తీవ్ర పోటీ మధ్య నిజామాబాద్ క్రీడాకారులు సత్తా చాటారు. షేఖ్ మైతాబ్ అహ్మద్ (–81 కిలోలు) రెండు విభాగాల్లో పోటీపడి ఒక బంగారు, ఒక కాంస్య పతకం సాధించాడు. షేక్ తల్హా (–41 కిలోలు) వెండి పతకం, ఇల్హాన్ అబ్దుల్లా ఫారూకీ (–31 కిలోలు) కాంస్య పతకం సాధించారు. ఈ విజయాల వెనుక అంతర్జాతీయ కోచ్, రిఫరీ, భారత గౌరవ రత్న సమ్మాన్ అవార్డు గ్రహీత డా. అబ్దుల్లా ఫారూకీ మార్గదర్శకత్వం, క్రీడాకారుల క్రమశిక్షణ, అంకితభావం, కఠోర శిక్షణ కీలకంగా




నిలిచాయి. నిజామాబాద్‌కు తిరిగి వచ్చిన క్రీడాకారులను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సాదరంగా స్వాగతించి సన్మానించారు. పతక విజేతలకు సర్టిఫికెట్లు అందజేసి వారి విజయాలను అభినందించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి విజయవంతమైన జీవితానికి ఎంతో అవసరమని సూచించారు. ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. ముఖ్యంగా తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు మరింతగా



పాల్గొనాలని పిలుపునిచ్చారు. మాజీ ఉప మేయర్ మిర్ మజాజ్ అలీ సాహబ్ కూడా తన నివాసంలో తైక్వాండో విద్యార్థులను సన్మానించి పతక విజేతలను అభినందించారు. భవిష్యత్తులో ఈ క్రీడాకారులు ఆసియా, ఒలింపిక్ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. నిజామాబాద్ యువ క్రీడాకారుల అంతర్జాతీయ విజయం వారి తల్లిదండ్రులు, కోచ్‌లు, తైక్వాండో సమాజంతో పాటు జిల్లా ప్రజల్లో ఆనందం, గర్వాన్ని నింపింది. కష్టపడి పనిచేస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించవచ్చని ఈ విజయం నిరూపించిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# పీఆర్సీ ప్రకటించాలి

- **పెండింగ్ డీఏలు విడుదల చేయాలి**
- **టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్**

**ఎల్లారెడ్డి, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయడంతో పాటు పీఆర్సీని ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ 25ను సవరించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చింతల లింగం అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసనలు, 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పీఆర్సీ ప్రకటించే వరకు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబరులో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ చేపడతామని హెచ్చరించారు. జీఓ 25ను సవరించడం, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టడం, సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపు,




పెండింగ్ బిల్లుల విడుదల తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చింతల లింగం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు తృప్తి వాసు, జిల్లా కార్యదర్శిలు నాగభూషణం, నరేందర్ గోపు శ్రీనివాస్, సోలేటి నారాయణ, హరీష్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు కందుకూరి శ్రీనివాస్, రాజశేఖర్, కృష్ణమూర్తి, సునీల్ కుమార్, కామారెడ్డి మండల అధ్యక్షులు గ్యార బాబయ్య ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ గాంధారి మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్, అశోక్ బలరాం పాల్గొన్నారు

## రైతాంగ ప్రయోజనాలే లక్ష్యంగా సమిష్టి కృషి

- **నీటి వనరులను పొదుపుగా వినియోగించాలి**
- **నీటి పారుదల సలహా మండలి**

**నిజామాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధ్యక్షతన శనివారం జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పాల్గొనగా, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వర్చువల్‌గా హాజరయ్యారు. ప్రాజెక్టుల నీటి నిల్వలు, ఆయకట్టుకు సాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ పంటలు, పంటల వైవిధ్యీకరణపై చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించాలని పోచారం సూచించారు. ఇంకా పంటలు వేయని రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగు చేసేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే 3.96 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగిస్తూ రైతులకు సాగునీటి భరోసా కల్పిం



చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శ్రీరాంసాగర్‌లో 40 టీఎంసీలు, నిజాంసాగర్‌లో 10.78 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు వివరించారు. సింగూర్‌లో ప్రస్తుతం ఉన్న నీటిని తాగునీటి అవస రాలకే వినియోగించాల్సి ఉందని కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేలు సూచించారు. సమావేశంలో నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, వ్యవసాయ, ఉద్యానవన తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కల్లూరు పట్టణ ఇన్‌చార్జిగా కోసూరు వెంకటేశ్వర్లు

**తల్లాడ, ఆగస్టు 8 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ పార్టీ కల్లూరు మున్సిపాలిటీ పట్టణ ఇన్‌చార్జిగా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కోసూరు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్ నుంచి శుక్రవారం నియామక పత్రం అందుకున్నారు. గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న తన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల



నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.



## దేవాలయాల అభివృద్ధికి టెండర్ ఆమోదం

**నిర్మల్--భైంసా/ముధోల్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ముధోల్ నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధి, నిర్మాణ పనులకు టెండర్ ఆమోదం లభించింది. కుబీర్ మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ మందిరం నిర్మాణం, తానూరు మండలం అంగీర్గా గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కళ్యాణ మండపం నిర్మాణానికి సంబంధించిన అప్రూవల్ కాపీలను మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులకు విట్టల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

### రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా




**నిజామాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టినట్లు కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీ.సీ. హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న 1,565 పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరణ అనంతరం 1,591కి పెంచేలా ముసాయిదా ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. ఓటర్ల సంఖ్య తదితర అంశాల ఆధారంగా 28 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు బాన్సువాడలో రెండు కేంద్రాలను తొలగించనున్నట్లు వెల్లడించారు. కొత్తగా ప్రతిపాదించిన కేంద్రాల్లో ఆర్మూర్‌లో 12, బోధన్‌లో 9, బాన్సువాడలో 1, నిజామాబాద్ రూరల్, బాల్కొండలో 3 చొప్పున ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్, బాన్సువాడ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ డిప్యూటీ స్పీకర్ మధుసూదనాచారిని కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు



**తల్లాడ, ఆగస్టు 8 (తెలంగాణ వాణి):**
తెలంగాణ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారిని ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి మరియు ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష నరసింహ చారి ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు గంటల వెంకటాచారి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాజీ డిప్యూటీ స్పీకర్‌తో వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు తుమాటి రామారావు సతీమణి శ్రీదేవి కూడా పాల్గొని, మాజీ డిప్యూటీ స్పీకర్ మధుసూదనాచారిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘానికి చెందిన పలువురు ప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## చేయూత పింఛన్లకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

### ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



చేయూత పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. అర్హులందరూ సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల వారు ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులతో పాటు ఫైలేరియా, డయాలసిస్, సికిల్ సెల్, హీమోఫిలియా బాధితులు కూడా నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే దరఖాస్తు చేసి పింఛన్ మంజూరు పెండింగ్‌లో ఉన్న వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డుతో పాటు సంబంధిత కేటగిరీ ధ్రువీకరణ పత్రాలు జత చేయాలని సూచించారు. అవసరమైన పత్రాలు లేకుండా సమర్పించిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## అత్యవసర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

### కలెక్టర్‌కు తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా విజ్ఞప్తి



**వనపర్తి, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి పట్టణంలోని 33 వార్డుల్లో పారిశుధ్య లోపాలను వెంటనే సరిచేసి డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అత్యవసర చర్యలు చేపట్టాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా కోరారు. శనివారం 33, 24వ వార్డుల్లో ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. 33వ వార్డులో డెంగ్యూ బారిన పడిన చిన్నారిని పరామర్శించారు. మురుగుకాల్వలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, నిల్వ నీటితో దోమలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో రోజువారీ ఫాగింగ్, యాంటీ లార్వా మందుల పిచికారీ చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి రక్త పరీక్షలు, మందులు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో డెంగ్యూ బాధితులకు ప్రత్యేక పడకలు, ప్లేట్‌లెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కే.వంశీధర్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ సభ్యులకు టీవైజెఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శుభాకాంక్షలు



**నర్సాపూర్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం టీ వై జె ఎఫ్ నూతన కమిటీ సభ్యులను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సభ్యులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా టీ వై జె ఎఫ్ కోశాధికారి ఎస్. రవీందర్, జిల్లా జాయింట్ సెక్రటరీ జెల్ల భాగయ్య, ఆందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎం. బుచ్చయ్య, కోశాధికారి దేవునిగల్లా దుర్గయ్యలను అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని షేక్ మహబూబ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## వెల్గొండలో రూ. 10 లక్షల సి.సి. రోడ్డు పనుల శంకుస్థాపన

**జగిత్యాల /బుగ్గారం: 8 ఆగస్టు (తెలంగాణ వాణి విలేకరి)**



జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామంలో రూ. 10 లక్షలతో సి.సి. రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో వచ్చిన నిధులతో చేపట్టిన ఈ పనులకు వెల్గొండ సర్పంచ్ నీలం నందిని సంతోష్,బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్ లు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పుతాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తాం

### ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు అధిక లాభాలు : కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని ప్రాజెక్టుల నీటిని శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తామని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా సుమారు 35 వేల ఎకరాలకు, కడెం ప్రాజెక్టు ద్వారా 6 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. రైతులు తక్కువ



నీటితో సాగయ్యే కంది వంటి ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. పంట మార్పిడితో నీటి వినియోగం తగ్గడంతో పాటు రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది కంది సాగు విస్తీర్ణాన్ని 6 వేల నుంచి 10 వేల ఎకరాలకు పెంచినట్లు వెల్లడించారు. ఆయిల్‌పామ్ సాగు కూడా పెరుగుతోందని, ఇప్పటికే 2,500 ఎకరాలకు రైతులు డీడీలు సమర్పించారని తెలిపారు. తెలంగాణ జలసిరి కింద భూగర్భ జలాల పెంపునకు ఫామ్‌పాండ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నామని, 2,026 లక్ష్యానికి గాను ఇప్పటికే 3,000 వరకు ఫామ్‌పాండ్ల నిర్మాణానికి రైతులు ముందుకొచ్చారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రాజేంద్ర ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ఎలినినో ప్రభావంతో నీటి సంక్షోభం తీవ్రం..

- **వరి సాగును విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు చూడాలి.**
- **జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**జగిత్యాల:ఆగష్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎలినినో ప్రభావంతో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం తగ్గి నీటి సంక్షోభం మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సూచించారు. వరి సాగును విస్తరించకుండా తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గడంతో పాటు వర్షాల మధ్య సుదీర్ఘ విరామాలు ఏర్పడే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. దీంతో చెరువుల్లో నీటి నిల్వలు,భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలో మొత్తం 1,010 చెరువులు ఉండగా ప్రస్తుతం కేవలం 268 చెరువులు మాత్రమే నిండి ఉన్నాయని వివరించారు. ప్రస్తుత నీటి నిల్వలు జిల్లాలోని మొత్తం సాగు అవసరాలను తీర్చేందుకు సరిపోవని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టం ఇప్పటికే సగటున 1.12 మీటర్లు తగ్గిందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం మరింత తగ్గితే భూగర్భ జలాలు ఇంకా దిగజారే అవకాశం ఉందని కలెక్టర్



హెచ్చరించారు. తాగునీటికే ప్రాధాన్యత శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్‌పీ)లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల వరి సాగుకు పూర్తిస్థాయిలో నీటి సరఫరాపై ఆధారపడే పరిస్థితి లేదన్నారు. రైతులు ప్రస్తుతం లేదా ఇకపై కొత్తగా వరినాట్లు వేయడం, వరి సాగు విస్తీర్ణాన్ని పెంచడం పూర్తిగా నివారిం చాలని సూచించారు .ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలన్నారు. నీటి వినియోగాన్ని తగ్గించేందుకు వ్యవసాయ శాఖ సూచించిన కందులు, పెసర, మినుములు, ఆముదం, జొన్న, సజ్జలు వంటి తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ కోరారు. తగిన తేమ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే మొక్కజొన్న సాగు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాగు సాంకేతిక సూచనల కోసం రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ బి. సత్య ప్రసాద్ కోరారు.

## జిల్లా సాగునీటి సలహా మండలిపై సమీక్ష

### హాజరైన రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్గొండ ఆగస్టు 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నల్లగొండ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆయన జిల్లాలోని వివిధ ప్రాజక్టులలో ఉన్న సాగునీటి లభ్యత ,వినియోగం, తదితర అంశాలను సమావేశానికి హాజరైన రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి,సమావేశానికి హాజరైన ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులకు వివరించారు.ప్రస్తుతం ప్రాజక్టులలో ఉన్న నీరు తాగు నీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని,ఆ తర్వాతే పంటల గురించి ఆలోచించడం జరుగుతుందన్నారు. వర్షాలు లేకపోవడం,రాబోయే రోజుల్లో పై నుండి కూడా నీరు వచ్చే అవకాశం లేనందున వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేసుకోవద్దని కోరారు. ప్రాజక్టులు,బోర్ల కింద వరి వేసుకుంటే ఏ దశలో నైనా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని,వచ్చే 6 నెలలు ఇదే పరిస్థితులు ఉండవచ్చని, బోర్లలో కూడా నీరు తగ్గవచ్చని, వరికి అనుకూల పరిస్థితులు లేవని, జిల్లాలో రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేసుకోవద్దని పునరుద్ఘాటించారు. ఈ సీజన్ లో వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, కంప సాగర్ వ్యవసాయ శాస్త్ర వేత్తలు సూచించారు. కంది,మిల్లెట్స్,వంటి పంటలు వేసుకోవాలని, ఆపత్కాల పంటలైన కంది, పెసర, మినుము,బొబ్బర్లు,ఉలవలు, ఆముదం,పొద్దు తిరుగుడు, నువ్వులు,వేసుకోవాలని సూచించారు. ఆగస్టు 15 వరకే ప్రత్యా మ్నాయ పంటలు వేసుకే అవకాశం ఉందని,ఈ వారంలోనే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని,ఇందుకు అవసరమైన విత్తనాలు ,ఎరువులు ప్రభుత్వం ఇస్తుందని జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ షాక్‌కు గురైన గొర్రెలు మృతి

**జగిత్యాల/ బుగ్గారం: 8 ఆగస్టు (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామంలో మేతకు వెళ్లిన గొర్రెలు అనుకోకుండా ట్రాన్స్ ఫార్మర్ వద్ద మేత మేయడంతో విద్యుత్ షాక్ కు గురై రెండు గొర్రెలు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. బుగ్గారం గ్రామానికి చెందిన పరమాల లచ్చన్నకు చెందిన రెండు గొర్రెలు గోపులాపూర్ రూట్‌లోని టవర్ సమీపంలో ట్రాన్స్ ఫార్మర్ వద్ద జరిగిన సంఘటన ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలపడం జరిగింది.మృతి చెందిన రెండు గొర్రెల విలువ దాదాపు రూ.45000 వేల వరకు ఉంటుందని బాధితుడు పరమాల లచ్చన్న తెలిపారు. విద్యుత్ షాక్ కారణంగా నష్టపోయిన తనకు న్యాయం చేసి, నష్టపరిహారం అందించాలని ఆయన అధికారులను కోరారు.



## ఐసీడీఎస్ పరిధిలో 22 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు

**18 నుంచి 35 ఏళ్ల మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**

**జగిత్యాల:ఆగష్టు 8(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 22 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ జయప్రద తెలిపారు. జగిత్యాల ప్రాజెక్టు పరిధిలోని వివిధ మండలాలు, మున్సిపాలిటీలలో ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి.రాయికల్ రూరల్ పరిధిలో 7, మేడిపల్లి మండలంలో 2, భీమారం మండలంలో 2, జగిత్యాల రూరల్ మండలంలో 4, రాయికల్ మున్సిపల్ పరిధిలో 3, జగిత్యాల మున్సిపల్ పరిధిలో 2, జగిత్యాల అర్బన్ మండలంలో 2 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఈ నెల 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు సీడీపీఓ జయప్రద వెల్లడించారు.

## చేనేత కళాకారులకు జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం

**రాజాపేట ఆగస్టు8(తెలంగాణ వాణి విలేకరి)**
జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని రాజపేట మండల జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేనేత కళాకారులకు సత్కారం చేశారు. రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజపేట మండల జర్నలిస్టు అసోసియేషన్ సభ్యులలో రాజపేట పట్టణ కేంద్రానికి చెందిన చేనేత కళాకారులైన జర్నలిస్టులకు చేనేత శాలువాలతో సత్కారం చేశారు. జర్నలిస్టులు పెంట రమేష్, గొట్టిపాముల నర్సింలు, బిర్రు శ్రీనివాస్ లకు సత్కారం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పల రమేష్, పలువురు స్థానికులు సట్టు బాల నర్సయ్య , అంకతి బిక్షపతి, సకినాల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.





## అవసరాలను బట్టి నీటి వినియోగం జరగాలి:

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

**నిర్మల్, ఆగస్టు 08(తెలంగాణ వాణి ప్రతినిధి)**
రైతుల పంటల అవసరాలను, ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా నీటి వినియోగం చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఆయన లక్ష్మణచందా మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఉన్న చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెరువులోని నీటి మట్టం, గ్రామంలోని వ్యవసాయ సాగు నీటి అవసరాలను బేరీజు వేసుకొని నీటిని విడుదల చేయాలని సూచించారు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి నీరు అందేలా, వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

అనంతరం చెరువు తూము పరిస్థితిని, కట్ట దృఢత్వాన్ని అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడే ఉన్న స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి, చెరువు కింద సాగవుతున్న పంటల రకాలు, మొత్తం ఆయకట్టు విస్తీర్ణం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీకే ఫైల్స్, తెలియని లింకులతో జాగ్రత్త

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



ఏపీకే ఫైల్స్, తెలియని లింకులను వాట్సాప్, టెలిగ్రామ్‌లలో ఓపెన్ చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా, నకిలీ జాబ్ ఆఫర్లు, వర్క్‌ఫ్రం హోమ్ అవకాశాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో 'ఖాకీ కిడ్స్' కార్యక్రమం ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను నమ్మే ముందు పూర్తిగా పరిశీలించాలని సూచించారు. ఈ వారంలో జిల్లాలో 38 సైబర్ క్రైమ్ ఫిర్యాదులు నమోదైనట్లు తెలిపారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, ఆర్థిక మోసాల్లో వీలైనంత త్వరగా ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

## ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో బటర్‌ఫ్లై ఎగ్జిబిషన్

### చిన్నారులు, పెద్దలకు వినోదాల హరివిల్లు



**ఖమ్మం, ఆగస్టు 8 (తెలంగాణ వాణి):**
ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఎస్‌కే ట్రేడ్ ఫెయిర్ ఆధ్వర్యంలో బటర్‌ఫ్లై ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఆగస్టు 7 నుంచి 30వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో అన్ని వయసుల వారికి వినోదాన్ని అందించే పలు ఆకర్షణీయమైన కార్యక్రమాలు, ఆటలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు జానకిరామయ్య తెలిపారు. 14 ఏళ్లలోపు విద్యార్థులకు వచ్చే వారం నుంచి ఉచిత ఎంట్రీ పాస్‌లను అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సందర్శకులకు కేవలం రూ.50 ప్రవేశ రుసుముతో ఎగ్జిబిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ బటర్‌ఫ్లై పరికరం సందర్శకులను ఆకట్టుకుంటోందన్నారు. జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, డ్రాగన్ ట్రైన్, సలాంబో, కొలంబస్, వాటర్ బోట్, కార్స్, జంపింగ్, మహారాజా ట్రైన్, గుర్రాల విభాగాలు కూడా సందర్శకులను అలరిస్తాయని నిర్వాహకులు తెలిపారు.



## పెద్ద శంకరం పేటలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**,పటాన్ చెరు, పెద్ద శంకరం పేట, ఆగస్టు 8, (, తెలంగాణ వాణి):**
మండల కేంద్రమైన పెద్ద శంకరం పేట లో ముదిరాజ్ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నాడు పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న గురించి వక్తలు వివరించారు. ఈ కార్య క్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు కే. సాయిలు మహారాజ్, నిజున రమేష్, బి. శ్రావణ్ కుమార్, ఎం.సుధీర్, బోడు సత్యనారాయణ, సి. ఎచ్.మల్లీశం, గుండు శ్రీను, నిమ్మల గారి సాయిలు,డీ. సాయి విగ్నేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ చట్టం సమర్థవంతమైన అమలుకు చర్యలు చేపట్టాలి







**జమ్మికుంట, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సమాచార హక్కు చట్టం--2005ను జిల్లాస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కమిటీ కన్వీనర్ బండ నరేందర్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి పలు డిమాండ్లను వివరించారు. జిల్లాస్థాయిలో సమాచార హక్కు (ఆర్టీఐ) కమిటీ ఏర్పాటు, జిల్లా స్థాయి మానిటరింగ్ సభ్యుల వ్యవస్థను పునరుద్ధరించడం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్టీఐ సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సమాచార హక్కు చట్టంపై ఇప్పటికీ అనేక మందికి పూర్తి స్థాయిలో అవగాహన లేదని, ప్రజలను మరింత చైతన్యవంతం చేసేందుకు సమాచార హక్కు చట్టం సాధన కమిటీకి అధికారిక ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కమిటీకి కమిషన్‌లో సభ్యత్వం కల్పించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌కు సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండ నరేందర్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, తిరగమల్ల నాగార్జున, కుమారస్వామి, రాజు, ప్రసాద్, మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా బోనాల జాతర



**జగిత్యాల/వెల్గటూర్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో శనివారం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో బోనాలు సమర్పించారు. జోగిని, పోతురాజుల విన్యాసాలు, నృత్యాలు, కోలాటాలు, నవదుర్గల వేషధారణలతో నిర్వహించిన శోభాయాత్ర ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బిడారి సతీష్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో బోనాల జాతర నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన వినోద్ కుమార్



**హుజురాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ శనివారం నల్లబెల్లిలో పరామర్శించారు. సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఈ నెల 10న నల్లబెల్లిలో నిర్వహించనున్న సంతాప సభ ఏర్పాట్లను పరిశీలించారు. వర్షం నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక నాయకులకు సూచించారు.

# వల్బాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం




**వీణవంక, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, జమ్మికుంట ఆదిత్య అమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో వల్బాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గ్రీష్మ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. ఆసుపత్రి ఎండీ ఎలుక దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి శిబిరాలను కొనసాగిస్తామని తెలిపారు. బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ 180 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్ల విలువైన మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ స్వాతి, కరోబార్ రాజశేఖర్, పాలకవర్గ సభ్యులు, ఆదిత్య ఆసుపత్రి పీఆర్వోలు రఫిక్, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది అనిల్‌రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, పూజ, అనూష, శృతి తదితరులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## నెక్సస్ టెక్నో స్కూల్లో ఘనంగా బోనాల సంబరాలు



**నారాయణఖేడ్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నారాయణఖేడ్ పట్టణంలోని నెక్సస్ టెక్నో స్కూల్లో బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, బోనాల పండుగ విశిష్టతను చాటిచెప్పేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు బోనాల వేషధారణలో ఆకట్టుకోగా, పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు వాటి ప్రాధాన్యతను తెలియజేసేలా ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. బోనాల వంటి పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, విద్యార్థులు మన సంస్కృతిని తెలుసుకొని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ నగర్ హనుమాన్ టెంపుల్‌లో నూతన రూమ్ నిర్మాణం

**దాతలు ముందుకు రావాలని భక్తుల విజ్ఞప్తి**



**జమ్మికుంట, ఆగస్టు 8,(తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట పట్టణంలోని గణేష్ నగర్ హనుమాన్ టెంపుల్‌లో భక్తుల సౌకర్యార్థం నూతన రూమ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం ఆలయంలో నిర్వహించే సామూహిక గణేష్ నవరాత్రులు, దుర్గామాత నవరాత్రుల వేడుకల సందర్భంగా భక్తులకు, పూజా సామగ్రి నిల్వకు స్థలం సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆలయ ప్రాంగణంలో నూతన రూమ్ నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. రాబోయే రోజుల్లో ఆలయ అభివృద్ధికి మరిన్ని పనులు చేపట్టాల్సి ఉండటంతో నిధుల అవసరం ఉందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు, భక్తులు, స్థానికులు ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని గణేష్ నగర్ భక్తులు విజ్ఞప్తి చేశారు. భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, వచ్చే నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

# జమ్మికుంటలో పీఎల్ఎఫ్ఎస్ సర్వే

**ప్రజలు సహకరించాలి: గణాంక శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్**



**జమ్మికుంట, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్--2026)లో భాగంగా జమ్మికుంట పట్టణంలో సర్వే కొనసాగుతోందని ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, సీఐ సుధ గోని రామకృష్ణ గౌడ్‌లను కలిసి సర్వే కరపత్రాలను అందజేసి వివరాలను తెలిపారు. ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలపై విశ్వసనీయ గణాంకాల కోసం సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెలా సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఉద్యోగాలు, కూలి పనులు, వేతనాలు, మహిళల ఆదాయ వనరులతో పాటు గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల వివరాలను కూడా నమోదు చేస్తామన్నారు. సర్వేలో సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజు గౌడ్, బిల్ కలెక్టర్ గుంటి సాయికృష్ణ, మెప్మా సెక్షన్ సిబ్బంది బండి రజిత, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలి



**జమ్మికుంట, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగంగా ప్రకటించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జేకే అన్నారు. ఫీజుల వివరాల ప్రదర్శనతో పాటు పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం పడకుండా తెలంగాణ అసెంబ్లీలో ప్రత్యేకంగా 'ఫీజుల నియంత్రణ, క్రమబద్ధీకరణ బిల్లు' ప్రవేశపెట్టి చట్టం చేయాలని కోరారు. విద్య వ్యాపారం కాదని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లలో పూర్తి పారదర్శకత పాటించాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్వీ పోరాటం కొనసాగిస్తుందని జేకే స్పష్టం చేశారు.

## ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గీతం అవగాహన

**అధ్యాపకుల పర్యవేక్షణలో గణిత, విజ్ఞాన శాస్త్రాల బోధన**

**పటాన్ చెరు, ఆగస్టు 8, (తెలంగాణ వాణి):**
హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం ముత్తంగి లోని మహాత్మా జ్యోతీ బా పూలే బి సి వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ, సంగారెడ్డి లోకి ఎస్ ఓ ఈ బాలికల కళాశాలలోని ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం, గణిత, విజ్ఞాన శాస్త్ర అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్ డ్, ఈఏపీసెట్ పరీక్షలకు సమర్థవంతమైన సన్నద్ధత వ్యూహాలను విద్యార్థులకు అందించడంతో పాటు, ఇంజనీరింగ్, గణితం, విజ్ఞాన శాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించేలా వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. అధ్యాపక బృందం, విద్యార్థి వాలంటీర్లు కలిసి పరీక్షా సంబంధిత భావనలు,





సమయాన్ని ఆదా చేసే గణితంలో సులువైన మార్గాలు (షార్ట్ కట్లు), శాస్త్రీయ సమస్య పరిష్కార పద్ధతులు, వృత్తి మార్గదర్శనం పై ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. నేర్చుకున్న భావనలను మరింత పటిష్టం చేయడానికి ఒక ఆసక్తికరమైన క్విజ్ పోటీని నిర్వహించారు. ఇందులో విజేతలకు గీతం లోగో తో కూడిన వాటర్ బాటిళ్లు, పెన్నుల ను బహుమతిగా అందజేశారు. పోటీ పరీక్షల కోసం తమ ఆత్మవిశ్వాసాన్ని, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంచిన ఆచరణాత్మక చిట్కాలను, సులువైన పద్ధతులను విద్యార్థులు ఎంతగానో ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. అధ్యాపక సమన్వయ కర్తలు డాక్టర్ పి.నరసింహస్వామి, డాక్టర్ శివారెడ్డి శేరి, డాక్టర్ పి.జితేంద్ర సేనాపతి, డాక్టర్ ఎస్.చక్రవర్తిల పర్యవేక్షణలో, విద్యార్థులు త్రిషల్ సాయి వల్లేపల్లి, చింతలకుంట నితిన్ కుమార్, సుభాంగి పాండా, అనుష్క ప్రజాపతి, పిర్లమర్ల లక్ష్మీ వజ్ర, తలమంచి మనోజ్ కుమార్ ఈ ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కుక్కల దాడిలో నాటు కోళ్లు మృతి



**రాజపేట ఆగస్టు: 8(తెలంగాణ వాణి విలేకరి)**
రాజాపేట మండలం లోని పుట్టగూడెం గ్రామానికి చెందిన ముడావత్ తులిసి తనకు ఉన్న కొద్ది పాటి వేవసాయ భూమి లో నాటు కోళ్లు పెంచుకుంటూ వికలాంగుడు అయిన తన భర్త టేపాను పోషించుకుంటున్నారు. శనివారం ఉదయం అందజ 12:00 గంటల సమయంలో దాదాపుగా 30 కుక్కలు వచ్చి ఫారమ్ లోకి ప్రవేశించి 180 కి పైగా కోళ్లను చంపేశాయి. వృద్ధురాలైన తులిసికి సుమారు 6000 రూపాయల -నష్టం జరిగిందని ఏడ్చింది. సర్పంచ్ రాంజీ నాయక్ వారి కుటుంబాన్ని పరామర్శిస్తూ ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందిస్తాము అని బరోసా ఇచ్చారు.

## యూనివర్సల్ పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు



**పెద్దపల్లి, ఆగస్టు 8 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
పాలకుర్తి మండలంలోని యూనివర్సల్ ఐఐటీ ఫౌండేషన్ స్కూల్లో ఆషాఢ లష్కర్ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేసే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, స్వయంగా తయారు చేసి అలంకరించిన బోనాలను మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. పోతరాజుల వేషధారణలు, పాటలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.ఖ

## కేరళ పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు

**సాంప్రదాయ వేషధారణలతో అలరించిన విద్యార్థులు**



**జమ్మికుంట, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను జమ్మికుంట కేరళ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పోతురాజు, ఇతర సంప్రదాయ వేషధారణలతో నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాల చైర్మన్ కే.ఎస్. బెన్ని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు మన సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని అన్నారు.

## జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా (చేనేత) జర్నలిస్టుకు సన్మానం

**రాజపేట ఆగస్టు: 08(తెలంగాణ వాణి విలేఖరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండల జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మీసా వెంకటేష్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టు పెంట సత్యనారాయణ కు (చేనేత) సన్మానం చేశారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా (టీజేయు) తెలంగాణ జర్నలిస్టు యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఎండి యూసఫ్ తిరుణహరి నరేష్, బూడిద నరేష్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.



## కులగణన సర్వే రెమ్యూనరేషన్ బకాయిల విడుదలకై జిల్లా పరిషత్ సీఈఓకి వినతి




**పటాన్ చెరు, జిన్నారం, ఆగస్టు 8, (తెలంగాణ వాణి):**
జిన్నారం మండలంలో గత సంవత్సరం నిర్వహించిన కుల గణన సర్వేకు సంబంధించిన పారితోషికం (డబ్బులు) ఉపాధ్యాయులకు ఇంకా అందకపోవడం, అలాగే ఎంపీడీఓ కార్యాలయం జీ ఎచ్ ఎం సి లో విలీనం కావడం వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలపై జిన్నారం పీ ఆర్ టీ యు టీ ఎస్ సంఘం స్పందించింది. పి ఆర్ టీ యు టీ ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మాణయ్య ఆదేశాల మేరకు, శుక్రవారం నాడు జిల్లా పరిషత్ సీఈఓ జానకీ రెడ్డి ని పీ ఆర్ టీ యు టీ ఎస్ జిన్నారం మండల ప్రధాన కార్యదర్శి పవన్ రాజ్ నేరుగా కలసి విజ్ఞప్తి చేశారు.సర్వేలో పాల్గొని శ్రమించిన ఉపాధ్యాయు లందరికీ రావాల్సిన బకాయిలను వెంటనే జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై జిల్లా పరిషత్ సీ ఈ ఓ జానకీ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను త్వరలోనే పరిష్కరించి ఉపాధ్యాయులకు డబ్బులు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అదే రోజు సంగా రెడ్డి జిల్లా జడ్పీ సీఈఓ జానకీ రెడ్డి జన్మదినం సందర్బంగా పి ఆర్ టీ యు టీ ఎస్ జిన్నారం శాఖ తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు.

## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాలు...




**రాయికల్:ఆగస్టు 08 (తెలంగాణ వాణి)**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తిభావాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 'ప్రగతి బోనాల జాతర'ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సంప్రదాయ వేషధారణలు, జోగిని--పోతురాజుల విన్యాసాలు, నృత్యాలు,కోలాటాలు,నవదుర్గల వేషధారణలతో సాగిన శోభాయాత్ర పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో పాల్గొనగా.. జోగిని,పోతురాజుల విన్యాసాలు,కోలాటం,యోగ్‌చాప్, నవదుర్గల వేషధారణలు శోభాయాత్రకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి.శోభాయాత్రలో ప్రత్యేకంగా రూపొందించిన బోనాల శకటం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా ప్రగతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకుని,భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతోనే 'ప్రగతి బోనాల జాతర' నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్,కరస్పాండెంట్ జయశ్రీ, ఉపాధ్యాయ బృందము,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లనురద్దు చేయాలి

- కార్మికచట్టాలనుపునరుద్దిం చాలి
- సిఐటియు మండల కమిటీ డిమాండ్




**అశ్వరావుపేట ఆగస్టు 8 (తెలంగాణ వాణి)**
కార్మికవర్గం పోరాడి సాధించు కున్న చట్టాలను తొలగించి కొం తమంది పెట్టుబడుదారులకు అనుకూలంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్ లురద్దు చేయాలని కార్మిక చట్టాలను పునరుద్ధరిం చి అమలు చేయాలని ఈనెల 10న జైలు బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐ టియు జిల్లాఉపాధ్యక్షులు పిట్ట లఅర్జున్ కోరారుశనివారం హ మాలి అడ్డవద్దజరిగిన సమావే శంలో పిట్టల అర్జున్ మాట్లాడు తూ కార్మిక చట్టాలు అమలులో ఉన్నప్పుడుహమాలీకార్మికు లు ఐక్యంగాతమఎగుమతి దిగు మతి రేట్లు సాధించుకోవడంలో బేరసారాలుఅడిగేహక్కు ఎంతో ఉపయోగపడిందని అన్నారు. నూతనలేబర్ కోడ్ లో హమా లీలకు గాని అసంఘటిత కార్మి కులు గాని ఎటువంటి హక్కు లు లేకుండా మోడీ ప్రభుత్వం చేసిందనిఅన్నారు. ఏచట్టమైన మార్పు చేస్తే అది కార్మికులకు ప్రజలకుఉపయోగపడేదిగా ఉం డాలితప్పఉన్నహక్కులను హ రించేదిగాఉండకూడదనిఅన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే జై లు భరో కార్యక్రమంలో పెద్ద ఎ త్తున కార్మిక వర్గంపాల్గొని విజ యవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బండి ఏసు రమే షు మధు నాగేంద్రరావు షేక్ కాసిం పోకల హనుమంతరావు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పర్యటన.

**ఎల్లారెడ్డి ఆగస్ట్ 08 తెలంగాణ వాణి ప్రతినిధి**



ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న ముత్యాల పోచమ్మ అమ్మవారి బోనాల పండగ కార్యక్రమం లో ఆదివారం పాల్గొంటారు.. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పత్రిక ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, సోషల్ మీడియా మిత్రులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరుకుంటున్నాము

## తొర్రూరు మార్కెట్ అభివృద్ధికి రూ.92 లక్షల నిధులు

**జనగాం ఆగస్టు8(తెలంగాణ వాణి ప్రతినిధి)**



తొర్రూరు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి పనుల కోసం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృషితో రూ.92 లక్షల నిధులు మంజూరయ్యాయి.ఈ సందర్భంగా తొర్రూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్టు నాయక్, డైరెక్టర్లు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.మార్కెట్ అభివృద్ధికి మంజూరైన నిధులతో మౌలిక వసతులు మెరుగుపడి, రైతులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మార్కెట్ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అచ్చిరెడ్డి, ప్రసాద్, గోపాల్ నాయక్, వెంకటాచారి,సామ రామూర్తి,రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణలను ఖండించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

**మంచిర్యాల,ఆగస్టు 08 (తెలంగాణ వాణి):**
బ్యాంకు రుణాలు, అప్పుల చెల్లింపుల విషయంలో విపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ఖండించారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్తిన్ హోటల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి మాట్లాడారు.బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ మంచిర్యాల పర్యటన సందర్భంగా తనపై చేసిన ఆరోపణలు వాస్తవాలు తెలుసుకోకుండా చేసినవేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రూ.450 కోట్ల రుణానికి ఆమోదం లభించగా, తాను రూ.109 కోట్ల రుణం మాత్రమే తీసుకున్నానని,



వడ్డీతో సహా అసలు మొత్తాన్ని బ్యాంకుకు చెల్లించినట్లు స్పష్టం చేశారు.రాజకీయాల్లోకి రాకముందే వ్యాపార రంగంలో అంచెలంచెలుగా ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి సాధించానని తెలిపారు. అసత్య ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూడటం అవివేకమని అన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, సయ్యద్ షాహిద్ అలీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



**చౌటుప్పల్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కల్లుగీత కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గీత కార్మికులు ఐక్యంగా, చైతన్యవంతమై తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కల్లుగీత కార్మికుల హక్కులు, రక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న బస్సు యాత్ర బృందానికి చౌటుప్పల్ మండలం ఎల్లగిరిలో శ్రీకంఠ మహేశ్వర గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం, భార్యకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు నెలకు రూ.4 వేల పెన్షన్, తాటి, ఈత వనాల పెంపకానికి ప్రభుత్వ భూమి, అన్ని జిల్లా కేంద్రాల్లో నీరా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. తాటి, ఈత చెట్లను నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కవచం అందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మల్కపూర్, కొయ్యలగూడెం, పీపాల్ పహడ్, డి నాగారం గీత కార్మికులు పల్సమ్ అంజయ్య గౌడ్, మారగోని దయాకర్ గౌడ్, పెద్దులుగౌడ్ , పెద్ద అంజయ్య గౌడ్, చిన్న అంజయ్యగౌడ్, ప్రమీలగౌడ్, దేవేందర్ గౌడ్, కృష్ణ గౌడ్ , సత్యనారాయణ గౌడ్, సత్యనారాయణ ఆర్ టి సీ, బాలరాజు గౌడ్, నర్సింహ్మ గౌడ్, మల్లేశం గౌడ్, వెంకటేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 8 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన చిన్న వీరస్వామి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి శనివారం నిరుపేద కుటుంబానికి రూ.5 వేలు అందేశారు. మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, ఈ ఆర్థిక సహాయం వార్డు సభ్యులు పందుల యాదగిరి గౌడ్ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ యువజన ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి రేవన పెల్లి గోపాల్, పల్లె ఆనంద్ గౌడ్, పెద్దగోని గిరి గౌడ్, పొట్ట



వెంకటేష్, జనగాం అంజయ్య ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**జనగామ ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా కేంద్రంలోని భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ సమీక్ష సమావేశంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధనవంతి, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం,పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు,ప్రజాప్రతి నిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరంజన్‌రెడ్డిని విమర్శించే నైతికత మేఘారెడ్డికి లేదు

**కేఎల్ఐ పంపుల ప్రారంభం బీఆర్ఎస్ విజయం: గట్టు యాదవ్**

**వనపర్తి, ఆగస్టు 8 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) పరిధిలోని ఎల్లూరు, జొన్నలబొగడ, గుడిపల్లి రిజర్వాయర్ల నుంచి సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ డిమాండ్ చేశారు.వనపర్తిలో వారు మాట్లాడుతూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రాజెక్టులు, సాగునీటిపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హెచ్చరికల నేపథ్యంలోనే కేఎల్ఐ పంపులు ప్రారంభించారని, ఇది బీఆర్ఎస్ పోరాట విజయమని పేర్కొన్నారు. జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద నీటిని సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లను నింపి వానాకాలం, యాసంగి పంటలకు సాగునీరు అందించాలని



కోరారు. కేఎల్ఐ పరిధిలోని 500 చెరువులు, కుంటలను వెంటనే నింపాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశములో కె.మాణిక్యం, గంధం పరంజ్యోతి, ఉంగ్లం తిరుమల్, ధర్మశాస్త్ర, మహేశ్వర్ రెడ్డి, జోహెబ్ హుస్సేన్, సయ్యద్. జమీల్, పాండు తదితరులు ఉన్నారు

## ధర్మన్ననగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

**అశ్వారావుపేట, ఆగస్టు 8 (తెలంగాణ వాణి):**
ములకలపల్లి మండలం ధర్మన్ననగర్ గిరిజన, గొత్తికోయ నివాస ప్రాంతంలో డైనాటా సంస్థ సీఎస్ఆర్ నిధులు, సమారిటన్స్ ఫర్ దినేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటెయినర్ ఆధారిత అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వందన గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించి లబ్ధిదారులకు పలు ప్రయోజనాలను అందించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులకు ప్రాథమిక విద్య, పౌష్టికాహారం, మెరుగైన సంరక్షణ అందించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో సహకరించిన డైనాటా సంస్థ, సమారిటన్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు..ఈ కార్యక్రమంలో స్థానిక స ర్పంచ్ కుంజారవిమాజీ జడ్పి టిసిబత్తుల అంజిమాజీ సర్పం చ్ కారం సుధీర్ యూత్ కాం గ్రెస్ నాయకులు సుమిత్ వంశీ సేవాదళ్ నాయకులు తిరపతి రెడ్డి,పిడి మేడంసీడీపీఓ మేడం కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయ కు లు, స్థానిక ప్రజాప్రతినిధులు, చీ+టా ప్రతినిధులు, అధికారు లు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





## పర్యావరణ పరిరక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత:

### - సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్

**చౌటుప్పల్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా చేపట్టాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా చేపట్టాలని సూచించారు. మొక్కల పెంపకంతో అటవీ శాతం పెరుగుతుందని, తద్వారా పర్యావరణ సమతుల్యతతో పాటు సమయానికి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, గట్టు ప్రశాంత్, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వదేశీ జీవనమే దేశ సమృద్ధికి మార్గం




**హనుమకొండ, ఆగస్టు 8 (తెలంగాణ వాణి టౌన్):**
స్వదేశీ జీవన విధానాన్ని ఆచరించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ భారత క్షేత్ర సంయోజక్ సత్తులింగమూర్తి అన్నారు. మడికొండలోని వేదవ్యాస పాఠశాలలో శనివారం స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అఖిలభారత సంపర్క ప్రముఖ్ అన్నదా శంకర పాణిగ్రాహి మాట్లాడుతూ స్వదేశీ అనేది నినాదం మాత్రమే కాదని, జీవన విధానమని పేర్కొన్నారు. దేశ సమృద్ధికి స్వదేశీ ఉత్పత్తులు, జీవన విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో దీపక్ శర్మ, జగదీష్, గురజాల రవీందర్, కంది శ్రీనివాస్ రెడ్డి, ఎం. రఘుపతి రెడ్డి, చింత ప్రకాష్, చిగురు పాటి వెంకన్న, వీసం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నోషి పరిశ్రమ కృషి అభినందనీయం:

### సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్



**చౌటుప్పల్, ఆగస్టు 8 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
విద్యాభివృద్ధికి నోషి పరిశ్రమ చేస్తున్న కృషి అభినందనీయమని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నోషి పరిశ్రమ సహకారంతో చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ, విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మాణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి, రోడ్డు పాఠశాల అభివృద్ధికి నోసి పరిశ్రమ అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగమైన నోషి పరిశ్రమ యాజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమ సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, గట్టు ప్రశాంత్, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అదరగొట్టిన ప్రజ్ఞానంద

## సెయింట్ లూయిస్ టైటిల్ కైవసం



**సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్ ప్రజ్ఞానంద సొంతం**

**ఒక రౌండ్ ముందే విజేతగా నిలిచిన గ్రాండ్ మాస్టర్**

**సిందరోవ్ డ్రాతో టైటిల్ ఖాయం**

**35 పాయింట్లకు గాను 23 పాయింట్లు సాధించిన ప్రజ్ఞానంద**

**50 వేల డాలర్ల బహుమతి**

**గ్రాండ్ చెస్ టూర్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి**



**న్యూయార్క్:** భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద మరోసారి తన సత్తా చాటాడు. అమెరికాలో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు. ఒక రౌండ్ మిగిలి ఉండగానే టైటిల్‌ను ఖాయం చేసుకున్నాడు. చివరి ప్రత్యక్ష పోరులో జవోఖిర్ సిందరోవ్‌తో ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. ఈ ఫలితంతో టైటిల్ అతని సొంతమైంది. మొత్తం 35 పాయింట్లకు గాను 23 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. సిందరోవ్ 22 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకున్నాడు. వెస్లీ సో 20.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. లెవాన్ అరోనియన్ 19 పాయింట్లతో నాలుగో స్థానం సాధించాడు. ఈ విజయంతో ప్రజ్ఞానందకు 50 వేల అమెరికన్ డాలర్ల నగదు బహుమతి లభించింది. అలాగే గ్రాండ్ చెస్ టూర్‌లో 13 పాయింట్లు కూడా ఖాతాలో చేరాయి. ప్లేఆఫ్ అవసరం లేకుండానే నేరుగా టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఫలితంతో గ్రాండ్ చెస్ టూర్ మొత్తం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఫాబియానో కరువానా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

జులై 31 నుంచి ఆగస్టు 7 వరకు జరిగిన ఈ టోర్నీలో ప్రపంచంలోని 10 మంది అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడ్డారు. ఐదు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రజ్ఞానంద ఆరంభం నుంచే ఆధిక్యాన్ని కొనసాగించాడు. చివరి వరకు సిందరోవ్ గట్టి పోటీ ఇచ్చినా టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో ఆగిపోయాడు. ఈ ఏడాది జూన్‌లో నార్వే చెస్ టోర్నమెంట్‌లోనూ ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. ఆ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను గెలిచిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు.

### కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టిన

# అజింక్యా రహానే

**యూరోపియన్ టీ20 లీగ్‌లో ఆడనున్న అజింక్యా రహానే**

**అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ జట్టుకు మార్క్యూ ప్లేయర్‌గా ఒప్పందం**

**అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెంటనే ఈ ప్రకటన**

**ఆగస్టు 26 నుంచి ప్రారంభం కానున్న తొలి ఎడిషన్ ఈటీపీఎల్**

**యూరప్‌లో క్రికెట్ అభివృద్ధికి ఇది కీలక ముందడుగు**



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజింక్యా రహానే తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెంటనే, యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో అడుగుపెట్టాడు. ఈ లీగ్ తొలి ఎడిషన్ కోసం అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ ఫ్రాంచైజీకి కీలక ఆటగాడిగా రహానే సంతకం చేశాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ యాజమాన్యం నేడు అధికారికంగా వెల్లడించింది.

ఐసీసీ ఆమోదం పొందిన యూరప్‌లోని మొట్టమొదటి టీ20 లీగ్ ఇదే కావడం విశేషం. ఈ లీగ్ తొలి సీజన్ ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఇందులో గ్లాస్గో, అమ్‌స్టర్‌డామ్, ఎడిన్‌బర్గ్, డబ్లిన్, బెల్ఫాస్ట్, రోటర్‌డామ్ నగరాలకు చెందిన ఆరు ఫ్రాంచైజీలు పోటీ పడనున్నాయి.

భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఆడిన రహానేకు అపారమైన అనుభవం ఉంది. ఐపీఎల్‌లో 212 మ్యాచ్‌లు ఆడి, ఇటీవలి సీజన్లలో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు నాయకత్వం వహించాడు. రహానే చేరికపై అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వా హర్షం వ్యక్తం చేశాడు. రహానే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, వినయం జట్టుకు ఎంతో మేలు చేస్తాయని అన్నాడు.

యూరప్‌లో క్రికెట్ అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం, ఒక విజయవంతమైన ఫ్రాంచైజీని నిర్మించడంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని రహానే పేర్కొన్నాడు.

### అక్కడ ఇమడలేకపోవచ్చు.. కానీ!

# సర్ఫరాజ్ ఖాన్ ఆసక్తికర పోస్టు



**న్యూఢిల్లీ:** భారత యువ ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. జాతీయ జట్టులోకి పునరాగమనం కోసం చేశాడా? ఐపీఎల్‌లో తన ఫ్రాంచైజీని వీడేందుకు సిద్ధమయ్యాడా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. జెర్సీ సినిమాలోని నాని ఫొటోను షేర్ చేసిన సర్ఫరాజ్.. "నేను అక్కడ ఇమడలేకపోవచ్చు. కానీ, నాకున్న శక్తితో పోరాడుతూనే ఉంటా. కొత్త అధ్యాయం.. జెర్సీ 2" అని క్యాప్షన్ ఇచ్చాడు.

సర్ఫరాజ్ ఖాన్ జాతీయ జట్టులోకి పునరాగమనం కోసం ఎదురు చూస్తున్నాడు. కానీ, అతడికి బీసీసీఐ నుంచి పిలుపు రావడం లేదు. చివరిసారిగా 2024లో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఆడాడు. ఆరు ఇన్నింగ్స్‌ల్లో 171 పరుగులు మాత్రమే చేశాడు. జట్టుకు దూరమైన తర్వాత ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెట్టిన సర్ఫరాజ్ చాలా బరువు తగ్గాడు. కానీ, సెలక్టర్లు మాత్రం అతడివైపు దృష్టిసారించలేదు.

సర్ఫరాజ్ ఖాన్ పోస్టు టీమ్‌ఇండియాలోకి రీఎంట్రీ గురించి కాదు.. ఐపీఎల్‌లో అతడు ఫ్రాంచైజీ మారబోతున్నాడనేందుకు సంకేతమని పలువురి అభిప్రాయం. ప్రస్తుతం అతడు చెన్నై సూపర్ కింగ్స్‌తో ఉన్నాడు. గత సీజన్‌లో కొన్ని మ్యాచుల్లో ఆడే అవకాశం మాత్రమే వచ్చింది. పెద్దగా ప్రభావం చూపించలేదు. దీంతో అతడిని వేరే ఫ్రాంచైజీకి ట్రేడ్ చేసే ఆలోచనలో సీఎస్‌కే ఉందని కథనాలు వచ్చాయి. శివమ్ దూబే, ఖలీల్ అహ్మద్‌తోపాటు సర్ఫరాజ్‌ను ఇచ్చి హార్దిక్ పాండ్యను ముంబయి నుంచి తీసుకోవాలనేదే వారి ప్రణాళికగా పేర్కొన్నాయి.



# బిజినెస్ Business

# సూచీలకు ఫైనాన్షియల్ షేర్ల బ్రేక్..




**నష్టాల్లో ముగిసిన మార్కెట్లు**

**సెన్సెక్స్ 455 పాయింట్లు,**

**నిఫ్టీ 65 పాయింట్లు నష్టం**

**ఫైనాన్షియల్, ప్రైవేట్ బ్యాంకింగ్**

**షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**ఆటో, ఐటీ రంగాల షేర్లు మార్కెట్‌కు మద్దతు**

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. ఫైనాన్షియల్, ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా మార్కెట్ ప్రారంభం నుంచి ఒడిదొడుకులకు లోనైంది. దిగ్గజ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో బలహీనత కారణంగా ప్రధాన సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 455.59 పాయింట్లు క్షీణించి 78,499.17 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ 65.35 పాయింట్లు నష్టపోయి 24,570.65 వద్ద ముగిసింది. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తగ్గించుకోవడంతో మార్కెట్ సెంటిమెంట్ రోజంతా బలహీనంగానే ఉంది. ముఖ్యంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయి మార్కెట్‌పై తీవ్ర [illegible] పెంచాయి. నిఫ్టీ షేర్లలో బజాజ్ ఫైనాన్స్, బజా[illegible] ట్రెంట్ టాప్ లూజర్లుగా నిలిచాయి.

### బజాజ్ పల్సర్ ఎన్160

# కొత్త అవతార్..

**బజాజ్ కొత్త పల్సర్ ఎన్160ను విడుదల**

**రెండు వేరియంట్ల ధరలు రూ.1.33 లక్షల నుంచి ప్రారంభం**

**165 సీసీ నాలుగు వాల్వుల ఇంజిన్**

**నాలుగు రైడింగ్ మోడ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్**

**క్రాల్ టెక్నాలజీతో సిటీ ట్రాఫిక్‌లో ప్రయాణం మరింత సులభం**

**ఐదు అంగుళాల రంగుల స్క్రీన్‌లో గూగుల్ మ్యాప్స్**

**మూడు కొత్త రంగుల్లో అందుబాటులోకి బైక్**



**న్యూఢిల్లీ:** బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్160ను కొత్తగా తీర్చిదిద్దింది. ఈసారి ఎన్160 ఎస్, ఎన్160 ఎస్ఎస్ పేర్లతో రెండు వేరియంట్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. వీటి ఎక్స్‌షోరూమ్ ధరలు వరుసగా రూ.1,33, 511, రూ.1,42,585గా ఉన్నాయి.

కొత్త పల్సర్‌లో 165 సీసీ నాలుగు వాల్వుల ఇంజిన్‌ను అందించారు. ఇది 18.5 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుందని కంపెనీ తెలిపింది. ఈ విభాగంలోనే అత్యధిక శక్తిని అందించే ఇంజిన్ ఇదేనని పేర్కొంది. 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 4.5 సెకన్లలో అందుకుంటుందని వెల్లడించింది. ఈ బైక్‌లో ఎలక్ట్రానిక్ థ్రాటిల్ వ్యవస్థను అమర్చారు. ఇది రైడింగ్‌కు అనుగుణంగా ఇంజిన్ స్పందనను మార్చి మరింత సాఫీగా ప్రయాణించేలా చేస్తుంది. అలాగే రెయిన్, స్పోర్ట్స్, రోడ్, ఆఫ్‌రోడ్ పేర్లతో నాలుగు రైడింగ్ మోడ్‌లను అందించారు. రహదారి పరిస్థితులకు అనుగుణంగా వీటిని ఎంచుకోవచ్చు. తొలిసారిగా ట్రాక్షన్ కంట్రోల్ సదుపాయాన్ని కూడా జోడించారు.

ట్రాఫిక్‌లో తరచూ క్లచ్, గేర్లు మార్చాల్సిన అవసరం తగ్గించే క్రాల్ టెక్నాలజీని ఈ బైక్‌లో తీసుకొచ్చారు. అలాగే ఐదు అంగుళాల రంగుల తెరతో పాటు గూగుల్ మ్యాప్స్ సదుపాయాన్ని కల్పించారు. ఈ విభాగంలోని స్పోర్ట్స్ బైక్‌ల్లో ఇది తొలిసారి అని బజాజ్ తెలిపింది.

బైక్‌కు కొత్త గ్రాఫిక్స్, రంగు అల్లాయ్ వీల్స్, సవరించిన హ్యాండిల్‌బార్, ఎత్తైన సీటు ఇచ్చారు. అట్లాంటిక్ బ్లూ, పెర్ల్ మెటాలిక్ వైట్, బ్రూక్లిన్ బ్లాక్ రంగుల్లో ఈ బైక్ అందుబాటులో ఉంటుంది.

# డాబర్‌కు హైకోర్టులో భారీ ఊరట..

**ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలకు బ్రేక్**

**డాబర్‌కు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట**

**ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధ ఆదేశాలపై ఆగస్టు 24 వరకు స్టే**

**విచారణ అవకాశం ఇవ్వలేదని హైకోర్టు అభిప్రాయం**

**'100 శాతం' క్లెయిమ్‌లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం**

**తమ ప్రకటనలు నిబంధనలకు అనుగుణమేనని డాబర్ వాదన**

**కేంద్రం, ఎఫ్ఎస్ఎస్ఏఐకి నోటీసులు జారీ చేసిన హైకోర్టు**




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్ ఇండియాకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. '100 శాతం' అంటూ ప్రచారం చేస్తున్న కొన్ని ఉత్పత్తుల విక్రయాలను నిలిపేయాలని ఆహార భద్రత నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన ఆదేశాలపై కోర్టు శుక్రవారం స్టే విధించింది. తదుపరి విచారణ జరిగే ఆగస్టు 24 వరకు ఈ స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది.

డాబర్‌కు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండా ఇలాంటి నిషేధాజ్ఞలు జారీ చేయడం సరైన విధానం కాదని జస్టిస్ అమిత్ మహాజన్ అభిప్రాయపడ్డారు. ఈ దశలో డాబర్ వాదనల్లో ప్రాథమికంగా బలం కనిపిస్తోందని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం, ఎఫ్ఎస్ఎస్ఏఐకి నోటీసులు జారీ చేసి వివరణ కోరారు.

తేనె, ఆవు నెయ్యి, వంట నూనెలు, యాపిల్ సైడర్ వెనిగర్, కొబ్బరినీళ్లు తదితర ఉత్పత్తులపై '100 శాతం నేచురల్', '100 శాతం ప్యూర్', '100 శాతం ప్యూరిటీ గ్యారంటీ', '100 శాతం ఆర్గానిక్', '100 శాతం టెండర్ కొబ్బరి నీళ్లు' వంటి ప్రచారాలు నిబంధనలకు విరుద్ధమని ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇవి వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని పేర్కొంది.

డాబర్ హిమాలయన్ ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్, డాబర్ ఆర్గానిక్ హనీపై జైవిక్ భారత్ లోగో వినియోగంపైనా ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం తెలిపింది. అలాగే డాబర్ హోమ్‌మేడ్ కొబ్బరిపాలపై '100 శాతం ప్యూరిటీ' అనే క్లెయిమ్ కూడా అనుమతించదగినది కాదని పేర్కొంది.

అయితే ఈ ఉత్పత్తులను దశాబ్దాలుగా విక్రయిస్తున్నామని, షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, తమ వాదనలు వినకుండా నిషేధం విధించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని డాబర్ కోర్టుకు వివరించింది. తమ ఉత్పత్తుల లేబుళ్లు అన్ని చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని, వినియోగదారులను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఎప్పుడూ చేయలేదని పేర్కొంది.



## 'బేబీ' కాంబినేషన్ రిపీట్: ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యల 'ఎపిక్' రిలీజ్ డేట్ ఫిక్స్!

టాలీవుడ్ యువ హీరో ఆనంద్ దేవరకొండ, కథానాయిక వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. 'బేబీ' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఈ విజయవంతమైన కాంబినేషన్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో సినిమాపై మొదటినుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సాయి సౌజన్య, నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ హిట్ వెబ్ సిరీస్ '90s -- ఎ మిడిల్ క్లాస్ బయోపిక్'తో గుర్తింపు పొందిన ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ ఒక కొత్త పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. అత్యంత అందమైన ప్రయాణాలు చాలా సాధారణ క్షణాలతోనే ప్రారంభమవుతాయి అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కలర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అయితే విజయ్ దేవరకొండ నటించిన రణబాలి సినిమా కూడా సెప్టెంబర్‌లోనే విడుదల కాబోతుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ రెండు సినిమాలు ఒకేసారి విడుదల అయితే అన్నదమ్ములు తొలిసారి బాక్సాఫీస్ వద్ద పోటీపడబోతున్నారు. అయితే రష్మిక మందన్నాకు గాయం కావడంతో రణబాలి వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



## టాలీవుడ్‌లో రితికా నాయక్ హవా..

### 'కొరియన్ కనకరాజు' విజయంతో పెరిగిన క్రేజ్!

టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ రితికా నాయక్ ప్రస్తుతం టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ చిత్రంలో చైత్ర అనే మోడరన్ పాత్రలో కనిపించిన రితికా నాయక్ తన అద్భుతమైన అభినయంతో పాటు అందచందాలతో కుర్రకారును ఎంతగానో ఫిదా చేస్తున్నారు. తెరపై ఆమె లుక్స్, పెర్ఫార్మెన్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అయితే కెరీర్ ప్రారంభం నుండి వరుస విజయాలను సొంతం చేసుకుంటూ వస్తున్న ఈ అమ్మడు, టాలీవుడ్‌లో తిరుగులేని 'గోల్డెన్ హ్యాండ్' లేదా 'లక్కీ ఛార్మ్' అనే ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అశోక వనములో అర్జున కల్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన రితికా నాయక్, ఆ తర్వాత వచ్చిన చిత్రాలతోనూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్నారు. ఏ పాత్రనైనా తన సహజమైన నటనతో రక్తికట్టించగల నటిగా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీకి, ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తూ, కథాబలమున్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న రితికా నాయక్ భవిష్యత్తులో మరిన్ని క్రేజీ ప్రాజెక్టలతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు




## హాలీవుడ్ రేంజ్‌లో అల్లు అర్జున్ 'రాకా' ముంబైలోనే ఆ భారీ షెడ్యూల్!

అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'రాకా' షూటింగ్ ప్రస్తుతం ముంబై కేంద్రంగా శరవేగంగా జరుగుతోంది. హాలీవుడ్ రేంజ్ టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ముంబైలోనే కొన్ని ప్రత్యేక సెట్లు వేసి కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి వెకేషన్‌కు వెళ్ళొచ్చిన అల్లు అర్జున్, హైదరాబాద్‌లో అభిమానులను కలిసిన తర్వాత తిరిగి ముంబై సెట్స్‌లో జాయిన్ అయ్యారు.

అయితే అసలు ప్లాన్ ప్రకారం ఈ చిత్రానికి సంబంధించి ఒక ముఖ్యమైన షెడ్యూల్ దుబాయ్‌లో జరగాల్సి ఉంది. కానీ ఇరాన్-యుద్ధం కారణంగా భద్రతా కారణాల రీత్యా దుబాయ్ షెడ్యూల్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. దీంతో దర్శకుడు అట్లీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా, దుబాయ్‌లో జరగాల్సిన షూటింగ్‌ను కూడా ముంబైలోనే భారీ సెట్లు నిర్మించి పూర్తి చేస్తున్నారు. వేర్వేరు లొకేషన్ల చుట్టూ తిరగకుండా, ఒకే ప్రాంతంలో ప్రత్యేక సెట్లు వేసి షూటింగ్‌ను శరవేగంగా ముగిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఆమె తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను దాదాపుగా పూర్తి చేసుకున్నారు. దీపికా ప్రెగ్నెంట్ కావడంతో ఆమెకు సంబంధించిన పార్ట్‌ను అట్లీ ముందుగానే ప్లాన్ చేసి కంప్లీట్ చేశారు. మరోవైపు, ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్ బాధ్యతలను ఒక ప్రముఖ హాలీవుడ్ స్టూడియో నిర్వహిస్తోంది. వారి సాంకేతిక అవసరాలకు తగినట్లుగా ముంబైలో ఒక భారీ సౌండ్ స్టేజ్‌ను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ భారీ సెట్లు, హాలీవుడ్ టెక్నీషియన్ల భాగస్వామ్యం, నటుల భారీ రెమ్యునరేషన్ల కారణంగా 'రాకా' బడ్జెట్ ఊహించిన దానికంటే ఎక్కువే అవుతోందని బాలీవుడ్ మీడియా వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S) Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com